## క్లుప్తంగా

### ఉపాధ్యాయుడి మృతి


జాఫర్(ఫైల్)

గుత్తి: పట్టణంలోని జెండా వీధికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు జాఫర్(53) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. జాఫర్ గుత్తి ఆర్ఎస్‌లోని ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తుండేవాడు. కొన్ని రోజులుగా కామెర్లు కావడంతో అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం ఇంటిలోనే తుది శ్వాస విడిచాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. జాఫర్ మృతి పట్ల ఉపాధ్యాయ సంఘాలు సంతాపం ప్రకటించారు.

### 'చలో అసెంబ్లీ' విజయవంతం చేయండి

గుంతకల్లు: జీఓ 1ని ప్రభుత్వం ఉపసహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 20న తలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సభలకు అనుమతులు ఇచ్చినా సభలకు రాన్వికుండా ఎక్కడికక్కడే అడ్డుకుంటున్నారన్నారు. ఇటీవల టిడ్కో ఇళ్ల సమస్యపై విజయవాడలో సభకు పక్కనే ఉన్న గన్నవరం నుంచి రాకుండా అడ్డుకోవడం దారుణమని విమర్శించారు. చలో అసెంబ్లీ కార్యక్రమంలో సీపీఐ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, నాయకులు బి.మహేష్, గోపీనాథ్, రాము, ఎస్ఎండీ గౌస్, రామాంజినేయులు పాల్గొన్నారు.

### తెలుగు క్యాలెండర్ విడుదల


క్యాలెండర్ విడుదల చేసిన దృశ్యం

గార్లదిన్నె: కృష్ణాపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం త్రైత సిద్ధాంతం కాలమానిక తెలుగు సంవత్సరం ఉగాది క్యాలెండర్ విడుదల చేశారు. త్రైత సిద్ధాంతం జ్ఞానవేదిక, ప్రబోధ సేవాసమితి కమిటీ అధ్యక్షుడు శివరాంప్రసాద్ మాట్లాడుతూ శోభకృత్ నామ సంవత్సరం ఉగాది తెలుగు త్రైత సిద్ధాంతం కాలమానిక క్యాలెండర్ విడుదల చేసి ఉపాధ్యాయులకు అందజేశామన్నారు. ఉగాది రోజు ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో దేవుడిని పూజించాలన్నారు. ఆరు గుణాలకు ప్రతీకగా షడ్రుచుల ప్రసాదం తయారు చేసి దైవం ముందు ఉంచి ప్రసాదం సేవిస్తారన్నారు. జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు సుధాకర్, మునిరత్నం, చిరంజీవి, నరేష్‌బాబు పాల్గొన్నారు.

### బైక్ దగ్ధం


దగ్ధమైన బైక్

పుట్లూరు: మండలంలోని దోశలేడు గ్రామంలో శుక్రవారం రాత్రి చంద్రశేఖర్ అనే వ్యక్తికి చెందిన ద్విచక్రవాహనం దగ్ధమైంది. బాధితుడి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చంద్రశేఖర్ శుక్రవారం రాత్రి యథావిధిగా తన ఇంటి ముందు బైక్ నిలిపి నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఘటనపై గ్రామంలో విచారణ చేపట్టారు.

# అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టండి


బీకేఎస్‌లో ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీపీ సునీత. జెడ్పీటీసీ భాస్కర్


గుత్తిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ విశాలాక్షి


గుత్తిలో ప్రచారం నిర్వహిస్తున్న హరీష్‌యాదవ్, నాయకులు

బుక్కరాయసముద్రం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించడం ద్వారా అభివృద్ధి, సంక్షేమానిక పట్టం కట్టాలని ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్ ఓటర్లను కోరారు. శనివారం సాయంత్రం వైఎస్సార్ సీపీ నాయకులు బుక్కరాయసముద్రం, కొట్టాలపల్లి, రెడ్డిపల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఓటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్స్, టీచర్స్ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నేత ఆలూరు రమణారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, బీకేఎస్ సర్పంచ్ పార్వతి, నాయకులు పూల నారాయణస్వామి, బుల్లే నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, ముత్యాలశీన, పురుషోత్తం, రాజారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లో శనివారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల తరఫున యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌యాదవ్ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్ బీ, జిల్లా కార్యదర్శులు గురుప్రసాద్‌యాదవ్, మధుసూదన్‌రెడ్డి, రాజ్‌కుమార్ రెడ్డి, బుసా సుధీర్‌రెడ్డి, పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్‌పర్సన్‌లు వరలక్ష్మి, పద్మలత, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్‌యాదవ్, పట్టణ సచివాలయ కన్వీనర్ రంగస్వామి, మున్సిపల్ కౌన్సిలర్లు వరదరాజులు, వాల్మీకి శివ,కేవీ రమణ, ఫరూక్, వెంకట సుబ్బయ్య, ఖాజా ఖాన్, నరేష్, నజీర్ , వార్డు ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ, తహసీల్దార్, ఉపాధిహామీ కార్యాలయాలలో ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలను గెలిపించాలని ఎంపీపీ ఆయా కార్యాలయాల్లో ఓటర్లను కోరారు. సీఎం జగన్ సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టి 1.34 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించారని ఎంపీపీ వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చిదంబరి, వాసుదేవరెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు హనుమంతు, ఇబ్రహీం, రంగస్వామి, గోపాల్ పాల్గొన్నారు.

పామిడి: పామిడితో పాటు గ్రామాల్లో శనివారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎం రామచంద్రారెడ్డి తరఫున వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. పట్టణంలో టౌన్ సచివాలయాల కన్వీనర్ బీ ఆసిఫ్, గ్రామాల్లో మండల కన్వీనర్ క నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఓట్లను అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్ని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి బీ రమణారెడ్డి, నాయకులు జోజోడే కుమార్, అనుంపల్లి సూరి, పార్వతీశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, విష్ణు, తంబళ్లపల్లి వెంకట్రామిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

### వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

యల్లనూరు: మండల కేంద్రంలోని లక్ష్మీ వేంకటరమణస్వామికి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శేష వాహనంపై వెంకన్న భక్తులకు దర్శనమిచ్చారు. మొక్కులు ఉన్న భక్తులు స్వామి సేవలో పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకుని పూజలు చేపట్టారు.

### సరుకుల సరఫరాకు కొటేషన్ల ఆహ్వానం

గుంతకల్లుటౌన్: పట్టణ నడిబొడ్డున గల అతిపురాతనమైన కోదండరామస్వామి ఆలయంలో ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరిగే శ్రీరామనవమి ఉత్సవాల నిర్వహణకు అవసరమైన కిరాణా, పూజ, ప్రసాదం సరుకుల సరఫరా, లైటింగ్ డెకరేషన్, షామియానాల ఏర్పాటు కోసం కాంట్రాక్టర్ల నుంచి కొటేషన్లను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు శనివారం ఆలయ ఈఓ మఠం మల్లికార్జున ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 19లోగా తమ కొటేషన్లను ఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

**16న ఆలయ హుండీ కానుకల లెక్కింపు**

శ్రీకోదండరామస్వామి ఆలయంలోని హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని ఈ నెల 16వ తేదీ ఉదయం నిర్వహిస్తున్నట్లు ఈఓ మల్లికార్జున పేర్కొన్నారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో జరిగే లెక్కింపులో భక్తాదులు పాల్గొనవచ్చని తెలియజేశారు.

## మహిళల విద్యాభివృద్ధితోనే మెరుగైన సమాజం


మాట్లాడుతున్న డాక్టర్ సుజాత

గుంతకల్లుటౌన్: ఆడపిల్ల చదువు ఇంటికే వెలుగునిస్తుందని, మహిళల విద్యాభివృద్ధితోనే మెరుగైన సమాజ నిర్మాణం సాధ్యమని ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు డాక్టర్ సుజాత తెలిపారు. శనివారం ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో రామిరెడ్డి కాలనీలో అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ సుజాత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే విద్యాభివృద్ధితోనే సాధ్యమన్నారు. మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ కనబరచాలని చెప్పారు. పీఓడబ్ల్యూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మణి మాట్లాడుతూ మహిళల రక్షణకు ప్రభుత్వం కఠిన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం నియోజకవర్గం కార్యదర్శి ఆశాబీ, చైల్డ్‌లైన్ ఆర్గనైజర్ భాగ్యలక్ష్మి, ఐఎఫ్‌టీయూ నియోజకవర్గ కార్యదర్శి జి.చిన్నా తదితరులు పాల్గొన్నారు.

## భద్రతపై కార్మికులకు అవగాహన అవసరం


భద్రతా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పరిశ్రమల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ కేశవులు

తాడిపత్రి టౌన్: ప్రతి కార్మికుడు భద్రతపై అవగాహన కల్గి ఉండాలని పరిశ్రమల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ కేశవులు సిమెంట్ పరిశ్రమ ఉద్యోగులు, కార్మికులకు సూచించారు. తాడిపత్రి మండలం తలారి చెరువు సమీపంలోని పెన్నా సిమెంట్ పరిశ్రమలో శనివారం 52వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. పరిశ్రమల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ హాజరై భద్రతా పతాకాన్ని ఆవిష్కరించి ఉద్యోగులు, కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశ్రమలో ప్రతి కార్మికుడు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాల నుంచి రక్షించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ చీఫ్ జనరల్ మేనేజర్ పీవీ కృష్ణయ్యయాదవ్, బోయిరెడ్డిపల్లి పెన్నా సిమెంట్స్ జనరల్ మేనేజర్ జగదీశ్వరరెడ్డి, అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం


జయమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యాడికి: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేష్, రషీద్ అన్నారు. శనివారం రాయలచెరువు గ్రామానికి చెందిన చెరుకూరి జయమ్మ అనారోగ్యంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందింది. సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవడంతో ఆమెకు రూ.45 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరైంది. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సూచనల మేరకు నాగేష్, రషీద్ శివయ్య, జిలాన్, రవికాంత్ జయమ్మ ఇంటి వద్దకు వెళ్లి చెక్కు అందజేశారు. ఇంటి వద్దే చెక్కు అందించటంతో జయమ్మ వైఎస్సార్‌సీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపింది.

పెద్దవడుగూరు: మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన వడ్డే గణేష్‌కు రూ.70 వేలు, రామరాజుపల్లె గ్రామానికి చెందిన వడ్డే నారాయణ స్వామికి రూ.80 వేలు, చిన్నవడుగూరు గ్రామానికి చెందిన కొండా విజయలక్ష్మికి రూ.28 వేలు సీఎం రిలీఫ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ నాయకులు బాధితులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, తాడిపత్రి మార్కెట్‌యార్డు చైర్మన్ హరినాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మహిళను కాపాడిన పోలీసులు


మహిళతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

శింగనమల: కుటుంబ కలహాల నేపథ్యంలో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చిన ఓ మహిళను సకాలంలో పోలీసులు గుర్తించి, కాపాడారు. శింగనమల ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు... రాచేపల్లి గ్రామానికి చెందిన నాగలక్ష్మి శనివారం ఉదయం తన భర్తతో గొడవపడి ఇంట్లో చెప్పకుండా ఆత్మహత్య చేసుకునేందుకు శింగనమల చెరువు వద్దకు చేరుకుంది. ఒంటరిగా చెరువు వద్దకు వెళుతున్న ఆమెను అదే సమయంలో అటుగా వెళుతున్న ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది గుర్తించి, ఆరా తీశారు. దీంతో తాను ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చినట్లు ఆమె వివరించడంతో అందుకు గల కారణాలను తెలుసుకుని స్టేషన్‌కు పిలుచుకెళ్లారు. అనంతరం కుటుంబసభ్యులను పిలిపించుకుని కౌన్సెలింగ్ ఇచ్చి బాధితురాలిని అప్పగించారు. సకాలంలో స్పందించి మహిళ ప్రాణాలను కాపాడిన పోలీసులను స్థానికులు అభినందించారు.

### రైతు ఆత్మహత్య

ఆస్తి తగాదాలే కారణం

పుట్లూరు: బాలాపురంలో ఓ రైతు ఆస్తి తగాదాతో శనివారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నాగమునాయుడు(55)కు కొన్నేళ్లుగా తన ఇద్దరు అన్నదమ్ములతో ఆస్తి తగాదాలు ఉన్నాయి. భూ వివాదాలు పరిష్కారం కాకపోవడంతో పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు కాలేదు. మరోవైపు సాగు చేసిన పంటల్లో నష్టం వచ్చినా ప్రభుత్వ పథకాలు వర్తించలేదు. దీంతో మనస్థాపానికి గురై క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

### మట్కా బీటర్ అరెస్ట్

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నెలో శనివారం మట్కాబీటర్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సాగర్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన అబ్దుల్లా అనే వ్యక్తి మట్కా రాస్తున్నట్లు సమాచారం రావడంతో అతన్ని అదుపులోకి రూ.26,170 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

### ఇసుక ట్రాక్టర్ సీజ్

తాడిపత్రి అర్బన్:తెలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సెబ్ అధికారులు శనివారం స్వాధీనం పట్టుకున్నారు. తాడిపత్రి మండలం ఇగుడూరుకు చెందిన రాజా తన ట్రాక్టర్‌తో పెన్నా నది నుంచి ఇసుకను తరలిస్తుండగా సెబ్ పోలీసులు దాడులు నిర్వహించారు. నాలుగు టన్నుల ఇసుకతో పాటు ట్రాక్టర్, డ్రైవర్ రాజాను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సెబ్ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

### ఘనంగా ఉరుసు


ప్రార్థనల్లో పాల్గొన్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి టౌన్ : మండలంలోని హాజివలి దర్గాలో శనివారం ఉరుసు ఘనంగా జరిగింది. దర్గాలో ఉదయం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం నేత, 2వ వార్డు కౌన్సిలర్ ఫయాజ్‌బాషా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు ఖాజా షంషేర్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా పల్లకీ సేవ

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ఈఓ కె. విజయ్‌కుమార్, అర్చకుడు గుండుస్వామి ఆధ్వర్యంలో పల్లకీ సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి మేళతాళాలతో ఆలయం చుట్టూ ఊరేగించారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థులను ఆశీర్వదించండి

గుంతకల్లుటౌన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎం.వీ.రామచంద్రారెడ్డికి మీ అమూల్యమైన ఓటుతో ఆశీర్వదించాలని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి శనివారం ఓ ప్రకటన ద్వారా నియోజకవర్గంలోని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పేదరికం లేని సమాజ నిర్మాణం , భావితరాలకు ఉజ్వల భవిష్యత్తును కల్పించడమే సీఎం జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగవకాశాలు కల్పించేందుకు, రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు సీఎం జగన్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. సీఎం జగన్‌తో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన ఫోన్‌కాల్ ద్వారా అభ్యర్థించారు.

## కసాపురానికి భక్తుల పాదయాత్ర


పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

గుత్తి రూరల్: సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరిసి పంటలు బాగా పండి సుభిక్షంగా ఉండాలని శనివారం బసినేపల్లి గ్రామానికి చెందిన కొందరు కసాపురం వరకూ పాదయాత్ర చేశారు. గ్రామానికి చెందిన తిమ్మప్ప స్వామి ఆలయ అర్చకులు సుధీంద్రనాథ్ ఆధ్వర్యంలో వేకువజామున ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి పాదయాత్ర ప్రారంభించారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండి రైతులతో పాటుగా ప్రజలు సుఖశాంతులతో ఉండాలని పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. పాదయాత్ర ముగిసిన అనంతరం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గుత్తి నుంచి కసాపురం మధ్య ఉన్న గ్రామాల ప్రజలు పాదయాత్ర చేస్తున్న వారికిఘన స్వాగతం పలికి వారికి సంఘీభావంగా కొద్దిదూరం నడిచారు.

## ఇష్టపడి చదివితే సత్ఫలితాలు


తల్లిదండ్రులకు పాదాభివందనం చేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని కొర్రపాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామలాదేవి పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో తల్లిదండ్రులతో విద్యార్థులకు దీవెనలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బాలికల విద్య, సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ముగిసిన సెంట్రల్ స్థాయి క్విజ్ పోటీలు


మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి సాయిరాం

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆర్డీటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సెంట్రల్ స్థాయి క్విజ్ పోటీలు ముగిశాయి. ఈ పోటీల్లో విభిన్న ప్రతిభావంతుల సెక్టార్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. స్థానిక ఆర్డీటీ ప్రధాన కార్యాలయ ఆడిటోరియంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ద్వితీయ స్థానంలో తాడిపత్రి ఏరియా విద్యార్థులు, తృతీయ స్థానంలో నల్లచెరువు ఏరియా విద్యార్థులు నిలిచారు. క్విజ్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి సాయిరాం, ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి, ఎడ్యుకేషన్ డైరెక్టర్ మోహన్ మురళి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఆర్డీటీ విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి, ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీతత్వ ప్రపంచంలో గ్రామీణ విద్యార్థులను తెలుగు, గణితం, సైన్స్, జనరల్ నాలెడ్జ్, ఇంగ్లిష్‌లో ప్రతిభ కనబరచడం హర్షించదగ్గ విషయమన్నారు. పోటీల్లో అనంతపురం, శ్రీసత్యసాయి పుట్టపర్తి, కర్నూలు, నంద్యాల, ప్రకాశం, ఒంగోలు జిల్లాల్లోని పిల్లలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ డైరెక్టర్లు రాజశేఖర్‌రెడ్డి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- నియోజకవర్గంలో 8,368 మంది పట్టభద్రులు, 758 మంది ఉపాధ్యాయ ఓటర్లు


పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

తాడిపత్రి: ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 13 న పోలింగ్ సజావుగా సాగేందుకు కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది నియామకం, పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. ఓటరు జాబితా ఆయా రెవెన్యూ కార్యాలయాల్లో ఉండడంతో పాటు, ఓటర్లకు స్లిప్పుల పంపిణీ కార్యక్రమం దాదాపుగా పూర్తయింది. ఇక పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల నియమావళి ప్రకారం 144 సెక్షన్ అమలులో ఉంటుంది. మొత్తం నియోజకవర్గంలో 13 కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో తాడిపత్రి పట్టణంలో 7, ఒక్కో మండల కేంద్రంలో 2 చొప్పున పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఒక పోలింగ్ కేంద్రానికి 1 పీఓ, 1 ఏపీఓ, ఇద్దరు ఓపీఓలు, 1 వెబ్ క్యాస్టింగ్, 1 వీడియోగ్రాఫర్, 1 మైక్రో అబ్జర్వర్, 01 బీఎల్ఓ కలిపి 20 మంది సిబ్బంది పని చేయనున్నారు.

**కట్టుదిట్టమైన భద్రత**

ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కట్టుదిట్టమైన పోలీసు భద్రతను ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ వీఎన్‌కే చైతన్య తెలిపారు. అతి సమస్యాత్మక, సమస్యాత్మక, సాధారణ పోలింగ్ కేంద్రాలున్నాయని, వీటిని దృష్టిలో ఉంచుకుని పోలీస్ భద్రతను ఏర్పాటు చేయనున్నామన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని యల్లనూరు, పుట్లూరు మండలాలలో సైతం పోలింగ్ కేంద్రాలున్నందున వాటిని దృష్టిలో వాటితో పాటు తాడిపత్రి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద దాదాపు 300 మంది పోలీసులను వినియోగించనున్నట్లు తెలిపారు. డీఎస్పీ స్థాయి అధికారితో పాటు, సీఐలు,ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, ఏఆర్ సిబ్బంది, హోంగార్డులు, కానిస్టేబుళ్లు తదితర సిబ్బంది ఉండనున్నట్లు వివరించారు.

**తాడిపత్రి నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు**

| మండలం | పట్టభద్రులు | ఉపాధ్యాయులు | పోలింగ్ కేంద్రాలు |
|---|---|---|---|
| తాడిపత్రి | 5,794 | 645 | తాడిపత్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తాడిపత్రి జూనియర్ కళాశాల |
| పెద్దపప్పూరు | 591 | 23 | జడ్పీహెచ్ఎస్ రూం నం.1,6 |
| పెద్దవడుగూరు | 904 | 42 | జడ్పీహెచ్ఎస్ క్లాస్ రూం. 8, 10 |
| యాడికి | 1,079 | 48 | జడ్పీహెచ్ఎస్ రూం. 19, 21 |
| మొత్తం | 8,368 | 758 | అన్నీ కలిపి 13 పోలింగ్ కేంద్రాలు |